


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 342, పేజీలు - 04

మంగళవారం, మే 6, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati


# నన్ను కోసుకుని తిన్నా పైసల్లేవు

**- ఉద్యోగ సంఘాలకు తేల్చి చెప్పిన రేవంత్**
**- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదన్న రేవంత్ రెడ్డి**
**- అప్పులూ ఎక్కడ పుట్టట్లేదు అని వ్యాఖ్య**
**- ఢిల్లీకి వెళితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్న సీఎం**
**- బజారులో మనల్ని ఎవరూ నమ్మడం లేదని వ్యాఖ్య**
**- ధరలు పెంచకుండా కొత్త కోరికలు నెరవేరవన్న సీఎం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఉద్యమ ప్రకటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్న సమయంలో ఉద్యోగ సంఘాలు సమరానికి దిగడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. "ఉద్యోగ సంఘాలు ఎవరిపై సమరం చేస్తున్నాయి? తెలంగాణ ప్రజలపై సమరం చేస్తారా?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వం జీతాలు ఇవ్వకున్నా మౌనంగా ఉన్న ఉద్యోగ సంఘాలు నేడు ప్రభుత్వం అడగకుండానే ఒకటో తేదీన జీతాలు ఇస్తుంటే సమరం అంటున్నారని సీఎం మండిపడ్డారు. ప్రభుత్వాన్ని

2లో..

# యుద్ధ సన్నాహాలు షురూ

**- దేశవ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్‌కు ఆదేశాలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్– భారత్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఏ క్షణమైనా యుద్ధం ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. పాకిస్థాన్ తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నెల 7న అన్ని రాష్ట్రాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచనలు చేసింది. శత్రు దేశాలు వైమానిక దాడులు చేస్తే ఎలా తప్పించుకోవాలి.? ఎలాంటి ప్రదేశాల్లో దాక్కోవాలి.? లాంటి అంశాలపై ప్రజలకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కల్పించాలని కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల

2లో..

# తెలంగాణ రూపురేఖలు మార్చేస్తాం

- తెలంగాణలో రూ.2 లక్షల కోట్ల హైవే పనులు
- రాబోయే 3-4 ఏళ్లలో ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళిక
- ప్రస్తుతం రూ. లక్ష కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం
- 2014 నుంచి రెట్టింపైన జాతీయ రహదారుల పొడవు
- కీలక ఎక్స్‌ప్రెస్‌వేలతో తగ్గనున్న ప్రయాణ సమయం, పెరగనున్న ఉపాధి

2లో..



# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు గుడ్ న్యూస్

**- మంగళవారం సాయంత్రంలోపు పరిహారం జమ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు మంగళవారం సాయంత్రంలోగా పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పంటనష్టాన్ని వెంటనే అంచనా వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా పిడుగుపాటుకు గురై చనిపోయిన 8 మంది బాధిత కుటుంబాలకు పరిహారం కూడా తక్షణమే అందించాలని ఆదేశించారు. రెండు రోజులుగా రాష్ట్రంలో అకాల వర్షాలు కుమ్మేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్రంలో కురిసిన వర్షాలు జరిగిన నష్టంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విపత్తుల నిర్వహణ అధికారులతో మాట్లాడారు. ఈ సమీక్షకు జిల్లా కలెక్టర్లు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో జరిగిన పంట,

2లో..

# తెలంగాణలో భూప్రకంపనలు

**- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రకంపనలు - రిక్టర్ స్కేలుపై 3.8గా నమోదు**



**హైదరాబాద్** తెలంగాణలో మరోసారి భూమి కంపించింది. సోమవారం (మే 05న) రోజున ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్వల్పంగా భూమి కంపించింది. భూప్రకంపనలు వచ్చిన ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో భూమి 2 సెకన్ల పాటు కంపించింది. మొదట ఉరుములు అనుకున్నప్పటికీ, భూమి కదలడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. అలాగే జగిత్యాల జిల్లా కేంద్రంలో కూడా భూమి ఒక్కసారిగా కంపించింది. సుమారు 3 సెకన్ల పాటు భూమి కుదుపులకు లోనవడంతో భయంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. జగిత్యాల పట్టణంతో పాటు కోడిమ్యాల, మాల్యాల, రాయికల్ పరిసర గ్రామాల్లో కూడా భూమి కంపించినట్లు సమాచారం. మరోవైపు నిర్మల్ జిల్లాలోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్‌చాందా మండలాల్లో 2 నుంచి 5 సెకన్లపాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 3.8గా నమోదైంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లోనూ స్వల్పంగా భూమి కంపించినట్లు సమాచారం.ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో సంభవించిన ఈ స్వల్ప భూకంపం ప్రజలను గతంలో సంభవించిన భూ ప్రకంపనలను గుర్తు చేసింది. ముఖ్యంగా 2024 డిసెంబర్ నెలలో ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో సంభవించిన భూకంపం తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లోనూ ప్రకంపనలు కలిగించింది. గోదావరి పరివాహక ప్రాంతంలో దాని ప్రభావం ఎక్కువగా ఉండటంతో ములుగు జిల్లా ఏటూరు నాగారంలో కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. గత ఏడాది సంభవించిన భూకంపం భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ ప్రభావం చూపింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ స్వల్పంగా ప్రకంపనలు నమోదయ్యాయి.తాజాగా సంభవించిన

2లో..




# నన్ను కోసుకుని తిన్నా పైసల్లేవు

అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, ఉద్యోగ సంఘాలు ఆ కుట్రలో పావులుగా మారొద్దని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కొత్త డిమాండ్లతో ధర్నాలు చేస్తే వ్యవస్థ కుప్పకూలుతుందని, ఉద్యోగ సంఘాలు బాధ్యత మరచి ప్రవర్తిస్తే సమాజం సహించదని సున్నితంగా హెచ్చరించారు. గత ప్రభుత్వంలా కాకుండా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నందుకా తమపై సమరం చేస్తున్నారని ఆయన నిలదీశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయని ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా అని ప్రశ్నించారు. సమస్యలు ఉంటే కూర్చొని చర్చించుకుందామని ఉద్యోగ సంఘాలకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమరం కాదని సమయస్ఫూర్తి, సంయమనం అవసరమని రేవంత్ రెడ్డి హితవు పలికారు. ప్రభుత్వం అంటే కేవలం తాము మాత్రమే కాదని, ప్రభుత్వ ఉద్యోగులంతా తమ కుటుంబ సభ్యులేనని ఆయన అన్నారు. రాష్ట్రం పూర్తిగా దివాళా తీసిన స్థితిలో ఉందని ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టడం లేదన్నారు. అప్పు కోసం బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బయట అణాపైసా కూడా చిక్కడం లేదని ఢిల్లీకి పోతే చెప్పులు ఎత్తుకు పోతాడేమో అని తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదని ఆయన అన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి కూడా లేదన్నారు. దీనంతటికీ స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు డిమాండ్ల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని, ఏ పథకాలు ఆపి తమ డిమాండ్లు నెరవేర్చాలో చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఉద్యోగ సంఘాలు తమను కోసినా కూడా 18 వేల 500 కోట్లకు మించి ఆదాయమేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు తనను కోసుకొని తిన్నా కూడా తమ దగ్గర పైసలు లేవని రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు తెలిపారు. ఏ పథకాలు ఆపాలో చెప్పాలంటూ ఉద్యోగులను రేవంత్ రెడ్డి అడిగారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని అందరం ఒక కుటుంబమని అలాంటి కుటుంబ పరువును బజారున పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని దివాళా తీయించిన కేసీఆర్ 3 నెలలకు ఒకసారి ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి ప్రభుత్వాన్ని తిట్టి పోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఫెయిల్ అయ్యాయని చెబుతూ కేసీఆర్ పైశాచికానందం పొందుతున్నారని నిప్పులు చెరిగారు. రాష్ట్రం ఆర్థికంగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఉద్యోగ సంఘాలు సహకరించి వ్యవస్థను కాపాడాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# యుద్ధ సన్నాహాలు షురూ

మేరకు అన్ని రాష్ట్రాల్లో ఎయిర్ రైడ్ వార్నింగ్ సైరెన్స్ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. సాధారణ ప్రజలు, విద్యార్థులు తమను తాము ఎలా రక్షించుకోవాలన్న దానిపై అవగాహన కల్పించనుంది. కేంద్ర హోం శాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో యుద్ధం ఏ క్షణమైనా ప్రారంభం కావచ్చనే సంకేతాలు అందుతున్నాయి. ఇక పాకిస్థాన్ పై ప్రతీకారం ఎలా తీర్చుకోవాలన్న దానిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. అధికార వర్గాలతో ప్రధాని మోదీ భేటీ అవుతుండటం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. తాజాగా వైమానిక దళం చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. దేశ రాజధానిలో గల ప్రధాని అధికారిక నివాసం నంబర్ 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఈ భేటీ జరిగింది. దాదాపుగా గంటకు పైగా ఈ సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ త్రివిధ దళాలతో సమావేశం అయ్యారు. వాళ్లకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పాకిస్థాన్ కు ఎలాంటి జవాబు ఇవ్వాలో సైన్యమే నిర్ణయిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు సింధూ జలాల రద్దుతోపాటు, వీసాల జారీ రద్దు, అటారీ– వాఘా బోర్డర్ మూసివేత కారణంగా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. ఇక జమ్మూకశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఎన్డీఆర్ఎఫ్, జమ్ము కాశ్మీర్ పోలీసులు పహల్గాం తీవ్రవాదులను ఎలాగైనా పట్టుకోవాలని తీవ్రంగా గాలింపు చేపట్టారు.

# తెలంగాణలో భూప్రకంపనలు

ఈ భూకంపాల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భూకంపాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భూమి కంపించినప్పుడు ఇంట్లో ఉంటే దృఢమైన టేబుల్ లేదా డెస్క్ కింద ఆశ్రయం తీసుకోవాలి, బయట ఉంటే భవనాలు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూకంప తీవ్రత 3.8గా నమోదవడం వల్ల పెద్దగా నష్టం వాటిల్లకపోయినా, ప్రజలు అప్రమత్తంగా ఉండటం మంచిదని అధికారులు తెలిపారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు గుడ్ న్యూస్

ప్రాణ నష్టం గురించి అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో అకాల వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను గురించి సీఎంకు కలెక్టర్లు వివరించారు. సమీక్షంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉందని సీఎం తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లు, అధికారులను సూచించారు. ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. పిడుగుల పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్‌లకు సందేశం వెళ్లని సమయంలో దగ్గరగా ఉన్నట్లైతే నేరుగా వెళ్లి అప్రమత్తం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా సచివాలయాల్లోని సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లాల్లో పరిస్థితులను బట్టి కిందిస్థాయి అధికారులతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ మేరకు ప్రాథమిక అంచనాల నివేదికను సీఎంకు అందజేశారు. ప్రధానంగా పశ్చిమ గోదావరి, నంద్యాల, కాకినాడ, సత్యసాయి జిల్లాల్లో ఈ పంటలకు నష్టం వాటిల్లిందని అన్నారు. అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 మండలాల్లో 1,033 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని వివరించారు. నంద్యాల జిల్లాలో 641 హెక్టార్లలో, కాకినాడ జిల్లాలో 530 హెక్టార్లలో, సత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని అధికారులు వివరించారు.

### 138 హెక్టార్లలలో ఉద్యాన పంటలకు నష్టం

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న హార్టికల్చర్ పంటల వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ఎక్కువగా అరటి, మామిడి పంటలకు నష్ట వాటిల్లింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యానవన పంటలకు నష్టం కలిగిందని అధికారులు వివరించారు.

### ధాన్యం కొనలేదనే మాట రాకూడదు

రబీలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్ గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రైతుల వద్దనున్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రావాల్సిన పంటకంటే అదనంగా వస్తే అవసరమైతే కేంద్రంతో మాట్లాడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ ఒక్క రైతు నుంచి కూడా తమవద్ద ధాన్యం కొనలేదనే మాట ఉత్పన్నం కాకూడదని అన్నారు.

### అధికారులు మాణవీయ కోణంతో పనిచేయాలి

విపత్తుల సమయంలో ప్రభుత్వ అధికారులు యంత్రాంగం మాణవీయ కోణంలో పనిచేయాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడు కేవలం సహాయక చర్యలు చేపట్టడమే కాకుండా ఎలాంటి నష్టం వాటిల్లకండా ముందుస్తుగా యంత్రాంగం సన్నద్ధమవ్వాలన్నారు. గతంలో హుద్ హుద్ తుపాను సమయంలో ప్రాణనష్టం కలగకుండా సమర్థవంతంగా పనిచేసిన తీరును ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విపత్తుల సమయంలో ఇలాంటి ముందస్తు సన్నద్ధత ఎంతో అవసరమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం నుంచి విపత్తు నిర్వహణ సంస్థ నుంచి ఎప్పటికప్పుడు వాతావరణం గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటామన్నారు. జిల్లా కలెక్టర్లందరూ దీనికనుగుణంగా ఆయా జిల్లాల్లో ఎట్టి పరిస్థితుల్లో మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతిక ఉందన్నారు. వీటిని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. సాంకేతికత కూడా వెళ్లలేని ప్రాంతాల్లో మానవ సాయంతో ప్రమాదాలు నివారించి మరణాలు లేకుండా చూడాలన్నారు. యంత్రాంగం ఎంత అప్రమత్తంగా ఉంటే నష్ట నివారణ అంత సమర్థవంతంగా చేయగలమని చెప్పారు. ప్రతి మండలంలోని అధికారులతో కలెక్టర్లు టెలీకాన్ఫరెన్సులు పెట్టుకుని అక్కడ సన్నద్ధత చర్యలను పర్యవేక్షించాలన్నారు.

# తెలంగాణ రూపురేఖలు మార్చేస్తాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాబోయే మూడు, నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రూ. 3,900 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పనులు చురుకుగా సాగుతున్నాయని గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రద్దీ తగ్గడం, తక్కువ ఖర్చుతో ప్రయాణం సాధ్యపడటం, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని, తద్వారా రాష్ట్ర మౌలిక సదుపాయాల రంగంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు. 2014లో తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు 2,511 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం అది దాదాపు రెట్టింపై 5,000 కిలోమీటర్లకు చేరిందని గడ్కరీ గుర్తుచేశారు. “తెలంగాణలో ఇప్పటికే రూ. 1.5 లక్షల కోట్ల పనులు పూర్తిచేశాం. కానీ ఇది ఆరంభం మాత్రమే. రాబోయే 3–4 ఏళ్లలో మరో రూ. 2 లక్షల కోట్ల విలువైన పనులు చేపడతాం. ఇవి కచ్చితంగా తెలంగాణ రూపురేఖలను మారుస్తాయని నేను విశ్వసిస్తున్నాను,” అని ఆయన అన్నారు. ఇండోర్–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 17,000 కోట్లతో 770 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలో 136 కి.మీ. ఉంటుంది. రాష్ట్రంలోని పనులకు (రూ. 4,500 కోట్లు) నూరు శాతం అనుమతులు పూర్తయ్యాయని, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల గుండా వెళ్లే ఈ మార్గం మార్చి 2026 నాటికి పూర్తవుతుందని తెలిపారు. దీనివల్ల ఇండోర్–హైదరాబాద్ ప్రయాణ సమయం 20 గంటల నుంచి 10 గంటలకు తగ్గుతుంది. సూరత్–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే: 1,100 కి.మీ.ల ఈ మార్గం తెలంగాణ మీదుగా కూడా వెళ్తుందని, ఇది ఉత్తర–దక్షిణాలను కలుపుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి కలను నెరవేరుస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఇది పూర్తవుతుందని, తెలంగాణలో 78 కి.మీ. మేర (పొరుగున ఉన్న కర్నూలును కలుపుతూ) ఉంటుందని చెప్పారు. దీనివల్ల సూరత్–చెన్నై మధ్య దూరం 300 కి.మీ., ప్రయాణ సమయం 28 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుంది.

సూర్యాపేట–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే: హైదరాబాద్–విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా రూ. 8,000 కోట్లతో 221 కి.మీ.ల ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 164 కి.మీ. తెలంగాణలోని సూర్యాపేట, ఖమ్మం జిల్లాల గుండా వెళ్తుంది. దీనితో హైదరాబాద్–విశాఖ ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గుతుంది. నాగ్‌పూర్–విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 16,000 కోట్లతో 565 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 401 కి.మీ. (రూ. 13,328 కోట్లు) తెలంగాణలోనే ఉంటుంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా వెళ్లే ఈ మార్గం నాగ్‌పూర్–విజయవాడ మధ్య దూరాన్ని 175 కి.మీ., ప్రయాణ సమయాన్ని 13 గంటల నుంచి 6 గంటలకు తగ్గిస్తుంది. హైదరాబాద్–పనాజీ కారిడార్: రూ. 20,000 కోట్లతో 563 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 90 కి.మీ. తెలంగాణలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల మీదుగా వెళ్లి జాతీయ రహదారి 44ను కలుస్తుంది. ఇది హైదరాబాద్–పనాజీ ప్రయాణ సమయాన్ని 15 గంటల నుంచి 7 గంటలకు తగ్గిస్తుంది. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. జగిత్యాల–కరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్, పక్కనున్న జిల్లాల వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన గడ్కరీ, వాటి అభివృద్ధికి నీరు, విద్యుత్, రవాణా, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో (రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్న చోట) తాను చేపట్టిన నీటి సంరక్షణ పనులను గుర్తుచేస్తూ, తెలంగాణలోని డ్యామ్‌లు, నీటి వనరుల పూడికను ఉచితంగా తీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంలో సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ, రవాణా ఖర్చు తగ్గింపు లక్ష్యంగా పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, సీఎన్జీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరిగితే రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో కల్లు తీసుకెళ్లనీయడం లేదని

# మహిళ గొడవ

**నల్గొండ** ఆర్టీసీ బస్సులో కల్లు తీసుకెళ్లనీయడం లేదని నల్గొండ జిల్లాలో ఓ మహిళ బస్సు కు అడ్డంగా నిలబడి హంగామా చేసింది. నకిరేకల్ నుండి కట్టంగూర్ మీదుగా నల్గొండ కు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు ను రోడ్డుపై నిలిపి బస్సును వీడియో తీస్తూ, బస్సులో కల్లు తీసుకుపోవద్దని రూల్ చెప్పింది ఎవడు అంటూ బస్సును అడ్డుకుంది.. సోషల్ మీడియా లో ఈ వీడియో వైరల్ అవడం తో నెటిజన్లు ఔరా అంటున్నారు..

# సర్వీసు రోడ్డులో అక్రమ నిర్మాణాలు

**– బీజేపీ ధర్నా**

**చౌటుప్పల్** యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అట్టి అక్రమ కట్టడం దర్గా పై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో కు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేసిన . ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,దూడల భిక్షం, బిజెపి నాయకులు పాల్గొన్నారు గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై గ్రీన్ ఫీల్డ్ హైవేలు మరియు ఎక్స్ ప్రెస్ రహదారులు నిర్మించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది కానీ విజయవాడ టు హైదరాబాదుకు వెళ్లే జాతీయ రహదారి 65 పై సర్వీస్ రోడ్లో అడ్డంగా ప్రార్థనా మందిరాలు నిర్వహిస్తున్న కానీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరిస్తున్నారు వీరి వ్యవహార శైలి చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని సుమారు 114 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిన తర్వాత అనుమతులు వచ్చిన తర్వాత దాని అలైన్మెంట్ ఈ దర్గా కోసం అలైన్మెంట్ మార్చారు మొదట ఎలాగైతే అనుమతులు ఇచ్చారో దాని ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఒక వర్గం కోసం ఎదురు చూడకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రహదారులు నిర్మించాలని కోరారు..

# ఆటోను ఢీకొన్న బొలెరో.. ఇద్దరు మహిళలు మృతి

**విజయవాడ** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో రాంగ్ రూట్లో వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ ఢీకొన్న ఘటన లో ఇద్దరు ఘటన ప్రదేశంలో మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న క్షతగాత్రులను అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఆరోగ్యం బాగుకోసం నడక శ్రేయస్కరం

**మంథని** ప్రస్తుతం మానవ జీవన శైలిలో వస్తున్న మార్పులు, తగ్గుతున్న శారీరక శ్రమ, ఆహార అలవాట్లు అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయని, ప్రతీ రోజు కనీసం అరగంట నడక ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కారమని వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. సోమవారం వాకార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో ఆరోగ్యం పట్ల మరింత చైతన్యం పెరిగిందని, నడక, యోగా, వ్యాయామంపై అత్యధికులు ఆసక్తి చూపుతున్నారని క్రమం తప్పకుండా రోజూ నడిస్తే మధుమేహం వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు.

అలాగే మధుమేహ ఉన్నా సరే గ్లూకోజు అదుపులో ఉంటుందని, అధిక రక్తపోటు, గుండె, క్యాన్సర్ సమస్యలు తదితర ముప్పును తగ్గిస్తుందని, శరీర బరువును నియం త్రిస్తుందని, మానసిక ఒత్తిడి, నిద్రలేమిని అధిగమించవచ్చునని, జీవ క్రియలను మెరుగుపర్చుతుందని, మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరగడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 120 మందికి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ వాకర్స్, జర్నలిస్టులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

## కార్మికుల హక్కుల కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులు కార్ల్ మార్క్స్

**– సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి : కడారి రాములు**

**– రాములు ఆధ్వర్యంలో ఘనంగా కార్ల్ మార్క్స్ 207వ జయంతి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవనంలో సోమవారం కార్ల్ మార్క్స్ 207వ జయంతిని సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ, కార్ల్ మార్క్స్ 1818 మే 5న జర్మనీలో జన్మించారని, 1883 మార్చి 14న మరణించేవరకు ప్రజాస్వామ్యం,కార్మిక హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించారని తెలిపారు. “పెట్టుబడి దారి విధానాలపై తన రచనల ద్వారా తీవ్రంగా విమర్శించిన మార్క్స్, కార్మిక లోకానికి నూతన దిశను సూచించారు. ఆయన రచనలు ం ముఖ్యంగా “ద క్యాపిటల్” వంటి గ్రంథం ం కార్మిక ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచాయి,” అని పేర్కొన్నారు.అయన రచనలు మార్క్స్ స్నేహితుడు ఎంగెల్స్ కృషి వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని తెలిపారు. రష్యాలో మొదటి ప్రజాస్వామ్య దేశ ఆవిర్భావానికి కూడా మార్క్సిజం ప్రామాణికమైందని వివరించారు. కార్ల్ మార్క్స్ ఆశయాలను కొనసాగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, కె.వి. అనసూర్య, పండుగ పోచమల్లు, కోకాపల్లి శాంత, పండుగ చంద్రయ్య, విక్రమ్, శేఖర్, పరిపెల్లి లచ్చయ్య తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పన్నులు వసూలు చేయడంలో అధికారులు చూపుతున్న ఆసక్తి అభివృద్ధి లో చూపించడం లేదు

**– వేములవాడలో మురికినీటి కాలువల కొరత**

**– సీపీఐ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి : కడారి రాములు**

**– అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికుల ఆవేదన**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని 4వ వార్డులో మురికినీటి కాలువల నిర్మాణం లేక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మురికి నీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి డెంగ్యూ, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధుల భయం పట్టిపీడిస్తోంది. దీనిపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తులు చేసినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో సీసీ రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయని వారు తెలిపారు.ఈ నేపథ్యంలో సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి,సందర్శించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ పన్నులు వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు చూపుతున్న ఉత్సాహం, అభివృద్ధి పనుల విషయంలో లేదని ఆరోపించారు.

దోమల నివారణకు నిత్యం మందు పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల పోశెట్టి, ఎల్ల దేవరాజు,పెంట మల్లేశం, టోనీ, కోరేపు శ్రీనివాస్, పండుగ చంద్రశేఖర్, నర్సింగోజి మారుతి తదితర నాయకులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్ దేశస్థులను బహిష్కరించాలని తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత

**– భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో అమాయక హిందువులపై ఉగ్రదాడులకు పాకిస్తాన్ మద్దతు కల్పించిందని ఆరోపిస్తూ, భారతదేశంలో ఉన్న పాకిస్తాన్ దేశస్థులను తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు, పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ నేతృత్వంలో ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలను అనుసరించి ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేశద్రోహులను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. మన రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్న దేశద్రోహులను కూడా తక్షణమే గుర్తించి, వారిని దేశం విడిచిపెట్టేలా చర్యలు తీసుకోవాలి” అని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అన్నం నరసయ్య, గుడిసె మనోజ్, వివేక్ రెడ్డి, కట్కం శ్రీనివాస్, నేరెళ్ల సాయి, తడక రాజు, బుర్ర మనీష్, నామాల శేఖర్, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజు, సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శిని మృతిపై మంథని లాయర్లు సంతాపం తెలియజేసినారు.

మంథని ( ప్రశ్న న్యూస్) హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని మృతిపై మంథని కోర్టులో రెండు నిమిషాల పాటు మౌనం వహించ అనంతరం కోర్టుల కార్యకలాపాలను ఈ రోజుకు నిలుపుదలచేశారు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ షెషన్సు జడ్జీ గా పనిచేసి వారి పకాలను ఈ సంద్బంగా గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్స్ పల్ జూనియర్ సివిల్ జడ్జీ శ్రీ నాగులారపు కీర్తి సింహ,బార్ అసోషియేషన్ అద్యక్షులు కెవిఎల్ఎన్ హరిబాబు,ఉపాధ్యక్షులు రఘోత్తం రెడ్డి,ప్రధాన కార్యదర్శి సహేందర్ రెడ్డి,న్యాయ వాదులు,కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు

# ఇసుక క్వారీలో మొదలైన ఓవర్ లోడ్ దందా...

**ఒక్కో లారీకి 1500 నుండి 2000 రూ. వసూలు**

**ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి...**

**స్థానిక ప్రజల నుండి వెల్లువెత్తుతున్న విమర్శలు...**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గంలో మల్హార్ మండలంలోని వల్లేకుంట ఇసుక క్వారీలో మళ్లీ ఓవర్ లోడ్ దందా మొదలైంది. ఒక్కో లారికి 1500 నుండి 2000 రూపాయలు వసూలు చేస్తున్నట్టు స్థానిక ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. వల్లెంకుంట క్వారీ నుండి డంపింగ్ చేయాల్సి ఉండగా నిబంధలను పట్టించుకోకుండా మంథని మండలం అడవి సోమన్ పల్లి వద్ద చెక్ డ్యామ్ కింద ఇరిగేషన్ క్వారీ నుండి డంపింగ్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి కొడుతూ... లక్షల నుండి కోట్లలో జేబులో నింపుకున్నట్టు స్థానిక నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ తరహా దందా అదికారుల కనుసనల్లోనే నడుస్తుందని స్థానిక ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు నిఘా పెట్టి ఈ దందాకు అడ్డు కట్టవేయాలనీ స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**అవకాశం దొరికిందని దుష్ప్రచారం చేస్తుండ్లు..**

# మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మంథని ( ప్రశ్న న్యూస్) పదహారు నెలల క్రితం వరకు కాళేశ్వరం అంటేనే కేసీఆర్ అని, కేసీఆర్ అంటేనే కాళేశ్వరం ప్రాజెక్టు అనే గొప్ప పేరు ఉన్న క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ప్రాజెక్టు విషయంలో అవకాశం దొరికిందని అనేక దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేశారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవ విషయాలకు దూరంగా అవాస్తవాలను ప్రచారం చేయడం కోసం పనిగట్టుకుని కాంగ్రెస్ సర్కార్ దుష్ప్రచారం చేస్తుందన్నారు. ఇలాంటి అవాస్తవ దుష్ప్రచారాలకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద బారీ ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు నిర్మించిన చరిత్ర కేసీఆర్‌దేనని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నీళ్లు అందించామని, నల్గొండ, ఖమ్మం, మెదక్ లాంటి జిల్లాలను కాళేశ్వరం నీళు సస్యశ్యామలం చేశాయని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, లక్షకోట్లు దోచుకున్నారంటూ తేలిగ్గా మాట్లాడుతున్నారని ఆయన వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బాగమైన మేడిగడ్డ బరాజ్‌లోని ఒక పిల్లర్ కుంగిపోయి పక్కనే ఉన్న మరో పిల్లర్‌పై బారం పడిందని, దీంతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందంటూ కాంగ్రెస్ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేశారన్నారు. ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డీఎస్ఏ ఏడాది తర్వాత నివేదిక ఇచ్చిందని, ఈ నివేదికలో పిల్లర్‌లకు మరమ్మత్తులు చేసి నీళ్లను ఆపవచ్చని పేర్కొందని, ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెప్పలేదన్నారు. చిన్న సమస్యను బూతద్దంలో పెట్టి చూపించి ప్రజలను నమ్మించే కుట్రలు చేశారని, ఇప్పటికే కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు ఒకసారి మోసపోయారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి దుష్ప్రచారాలను తిప్పికొట్టేలా చర్చా వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు.

## నమ్మినోళ్లను నట్టేట ముంచిన మంథని ఎమ్మెల్యే.

**పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే**



మంథని ( ప్రశ్న న్యూస్) మానిఫెస్టో కమిటి చైర్మన్‌గా మేలు చేస్తాడని నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన చరిత్ర మంథని ఎమ్మెల్యేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు – వాస్తవాలపై చర్చాకార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్ట్‌షాప్‌లను తొలగిస్తామని, నాలుగు వేల పించన్, మహిళలకు రూ.2500, కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాహకులు పరిహారం ఇప్పించేలా మానిఫెస్టో తయారు చేసి అమలు చేస్తామని ప్రజలను నమ్మించి వంచించాడన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాక ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సాగునీటికి కొదువ లేకుండా బీడు భూములను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగితే దాన్ని సాకుగా చూపి ఈ ప్రాంతంలోని పంటలను ఎండబెడుతున్నారని ఆయన అన్నారు. నిత్యం ముఖ్యమంత్రి పక్కనే కూర్చుంటూ మంత్రి ఏం చెప్పినా చెస్తానని సీఎం చెప్తున్నా ఈ నియోకవర్గ ప్రజల సమస్యలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసమే మంథని నియోజకవర్గ ప్రజల వాడుకుంటున్నాడని ఆయన ఆరోపించారు. చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తామని చెప్పి ఈనాడు పంటలు సాగు చేసే భూములను లాక్కుని కాలువలు తవ్వుతున్నారని, మంచి దిగుబడి ఇచ్చే పంటలను కాదని తాము పంటలు సాగు చేసుకోవాంటూ పోలీసులతో హూకూం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్న కాళేశ్వరం భూసేకరణ ఆపివేసి గ్రామసభల ద్వారా పరిశీలన చేసి పనులు చేయాలని ఆయన హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం పై ప్రజలు గమనించి ఆలోచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో మాజీ ఎమ్మెల్యే లు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, నడిపెల్లి దివాకర్ రావు, కోరుకంటీ చందర్, దుర్గం చిన్నయ్య మాజీ జడ్పీ చైర్ పర్సన్లు దావ వసంత, జక్కు శ్రీ హర్షిణీ తదితరులు పాల్గొన్నారు...

# ఆరోగ్యం బాగుకోసం నడక శ్రేయస్కరం

**- మెగా హెల్త్ క్యాంపులో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్**




మంథని( ప్రశ్న న్యూస్) ప్రస్తుతం మానవ జీవన శైలిలో వస్తున్న మార్పులు, తగ్గుతున్న శారీరక శ్రమ, ఆహార అలవాట్లు అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయని, ప్రతీ రోజు కనీసం అరగంట నడక ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కారంమని వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. సోమవారం వాకార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో ఆరోగ్యం పట్ల మరింత చైతన్యం పెరిగిందని, నడక, యోగా, వ్యాయామంపై అత్యధికులు ఆసక్తి చూపుతున్నారని క్రమం తప్పకుండా రోజూ నడిస్తే మధు మేహం వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు. అలాగే మధుమేహ ఉన్నా సరే గ్లూకోజు అదుపులో ఉంటుందని, అధిక రక్తపోటు, గుండె, క్యాన్సర్ సమస్యలు తదితర ముప్పును తగ్గిస్తుందని, శరీర బరువును నియం త్రిస్తుందని, మానసిక ఒత్తిడి, నిద్రలేమిని అధిగమించవచ్చునని, జీవ క్రియలను మెరుగుపర్చుతుందని, మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరగడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 120 మందికి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... వాకర్స్, జర్నలిస్టులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి రమేష్, గౌరవ అధ్యక్షులు రావికంటి మనోహర్, కొమరోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వేల్పుల గట్టయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరి గంధం ఆంజనేయులు, సాంస్కృతిక కార్యదర్శి లక్కాకుల నాగరాజు, గెజిటెడ్ అధికారుల సంఘం సంస్కృతిక కార్యదర్శి రావుల తిరుమల్, సహాయ కార్యదర్శి తాటి సమయ్య గౌడ్, కోశాధికారి సిలివేరి సతీష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఒడ్నాల శ్రీనివాస్, ఎక్కేటి అనంతరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కోమురోజు మారుతి బర్ల సంపత్, బాసాని సాగర్ దాసరి రాజేశం, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అసమర్ధ పాలనను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తుండ్లు...

- **ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు కట్టిన కేసీఆర్**
- **కాకతీయుల ఆలోచనకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్టు**
- **కాంగ్రెస్ అంటేనే మోసం...దగా...ద్రోహం...తెలంగాణాకు శని**
- **తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతున్న సీఎం**
- **మండలి బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసుధనాచారీ**



మంథని ( ప్రశ్న న్యూస్) 16నెలల అసమర్ధ పాలనను కప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ సర్కార్ అనేక ప్రయత్నాలు చేస్తోందని, పాలన చేతకాక, అభివృద్ధి చేయలేక తెలంగాణాను ఆగం చేస్తున్నారని మండలి బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసుధనాచారీ అన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు – వాస్తవాలపై చర్చా కార్యక్రమంలో బాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన చర్చావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను పటాపంచలు చేయాలనే ఆలోచనతో ఈ చర్చా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆనాడు సమైఖ్యాంధ్ర పాలనలో పాలనలో నీళ్లు, నియామకాలు, నిధుల దోపిడి జరిగిందని, నీళ్ల సమస్యతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని గ్రహించిన కేసీఆర్ ఆ దిశగా అడుగులు వేశారని, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముందుగా నీళ్ల ఉద్యమం మొదలు పెట్టారన్నారు. అయితే అపార జలరాశులు ఉన్నతెలంగాణ నీటి కోసం పడుతున్న గోస విషయంలో కాకతీయులను ఆదర్శంగా తీసుకున్న కేసీఆర్ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నీటిని ఒడిసిపట్టే కాకతీయుల ఆలోచనలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. పదేండ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి ప్రయోజనాలు పొందామని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వలసవాదులు తెలంగాణాకు దక్కాల్సిన నీళ్ల వాటాను తరలించుకుపోయి అన్ని రకాలుగా అభివృద్ధి చెంది మనపైనే పెత్తనం చెలాయించారన్నారు. 1956నుంచి2014వరకు అనేక ఏండ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సమస్యల కాసరంగా తయారైందని, ఈ క్రమంలో తెలంగాణ సాధనే సమస్యలకు పరిష్కారమని ఉద్యమనేత కేసీఆర్ ఆలోచన చేశారన్నారు. సమైఖ్యాంధ్ర అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలనే కుట్రలు చేస్తున్నారన్నారు. సాగునీటి రంగంలో అపురూపమైన ప్రగతిని చూసిన కాంగ్రెస్ ఆ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డాడని ప్రజలను నమ్మించే కుట్రలు చేశారని, అద్భుత ప్రాజెక్టును వక్రీకరించి అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేశారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏజెంట్ అనే విషయం అందరికి తెలిసిందేనని, ఇద్దరి సీఎంల సమిష్టి ప్రయోజనాల కోసం ఈ ప్రాంత ప్రయోజనాలను ఆంధ్రకు తాకట్టు పెట్టి ప్రయోజనం పొందేందుకు కుట్రలు చేస్తున్నారన్నారని ఆయన ఆరోపించారు.

### రోడ్డు విస్తరణ భూసేకరణ పనులు

# వేగంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**



వేములవాడ ఆలయ రొడ్డు విస్తరణ, భూ సేకరణ పనుల పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్

వేములవాడ,(ప్రశ్న న్యూస్) ఆలయ రోడ్డు విస్తరణ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వేములవాడ ఆలయ రోడ్డు విస్తరణ, భూ సేకరణ పనుల పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వేములవాడ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటికి అవసరమైన భూసేకరణ చేసేందుకు తొలగించాల్సిన సర్వే చేసి త్వరగా అందించాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 315 ఇండ్ల నిర్మాణాల ప్రతిపాదనలను 4 టీం ల ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ఇప్పటి వరకు 257 ఇండ్లకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు, మిగిలినవి వీలైనంత త్వరగా అందిస్తామని అధికారులు తెలిపారు. భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు మనకు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తి చేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధ భాయి, ఈ ఈ ఆర్ అండ్ బి రమణయ్య, వేములవాడ మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లన్న ఆలయంలో హుండీలో చోరీ




శ్రీశైలంశ్రీశైలం మల్లన్న ఆలయం హుండీ లో చోరీ జరిగింది. ఈనెల 1వతేదీన దర్శనం కోసం ఆలయానికి వచ్చిన స్థానికంగా నివసించే ఇద్దరు మైనర్ బాలురు, మల్లికార్జునస్వామి ఆలయం ప్రారంభంలో గల క్లాత్ హుండీని బ్లేడ్ తో కోసి డబ్బు తీస్తుండగా సీసీలో చూసి అధికారులు పట్టుకున్నారు. మైనర్ల దగ్గర 10,150 నగదు స్వాధీనం చేసుకొని ఆలయ ఈవో ఆదేశాలతో కేసు నమోదు చేసి గోప్యంగా శ్రీశైలం పోలీసులు విచారణ చేసారు.

గత పది రోజులగా ఇద్దరు మైనర్లు దర్శనం పేరుతో క్యూలైన్ల లో ఆలయంలోకి ప్రవేశం చేసారు. చోరీ విషయమై విధుల్లో అలసత్వం వహించిన మల్లన్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ ని సస్పెండ్ చేసే యోచనలో ఈవో శ్రీనివాసరావు వున్నట్లు సమాచారం. హుండీలో చోరీ ఇద్దరు మైనర్లు ఇద్దరు మేజర్లుపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

### తెలంగాణలో అక్రమంగా నివసిస్తున్న

## పాకిస్తానీ జాతీయులను బహిష్కరించాలి

- **బిజెపి బోయినిపల్లి మండల అధ్యక్షుడు : ఎడపల్లి పర్శరాం డిమాండ్**
- **తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఎడపల్లి పర్శరాం ఆధ్వర్యంలో బోయినిపల్లి మండల తహశీల్దార్ నారాయణ రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీ జాతీయులను వెంటనే గుర్తించి, బహిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. అయితే, ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని పహాల్గామ్ ప్రాంతంలో పాకిస్తాన్ ప్రోత్సహిత ఉగ్రవాదులు నిర్వహించిన దాడిలో 26 మంది అమాయక పౌరులు మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ హేయమైన చర్య దేశ ప్రజల్లో తీవ్ర ఆవేదనను కలిగించిందని, దీనికి నిరసనగా ప్రపంచ దేశాలు భారతదేశానికి మద్దతుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొంగోని అశోక్ గౌడ్, రాజూరి కిరణ్, గంగిపల్లి స్వామికుమార్, బూత్ అధ్యక్షులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, బోగోజి గంగాధర్ చారి, మెరుపుల గంగాధర్ గౌడ్, బ్రహ్మ ప్రసాద్, సారంపల్లి రాజు, తిరుపతి, రమేశ్, చంద్రయ్య, కళ్యాణం అనిల్, ప్రశాంత్, నాయిని నాగరాజు, తదితర భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాధితుల సమస్యల పరిష్కారమే

# లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 ఫిర్యాదులు స్వీకరణ: ఎస్పీ మహేష్ బి.గితే**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# వడగళ్ల వర్షానికి పంట నష్టం

**మెదక్ జిల్లా** మాసాయిపేట మండలం పోతాన్ పల్లి లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి ఎకరా వరి పొలం పంట పంట నష్టం వాటిల్లిందని రైతు తలారి విజయ్ ఆవేదన వ్యక్తంచేశారు. అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నానని పూర్తిగా పంట నష్టం జరుగుతుందని ప్రభుత్వం అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

# మహిళ కడుపులో కాటర్ ప్యాడ్స్

**- కమాపూర్ ఆసుపత్రిలో దారుణం**

**హనుమకొండ** ప్రసవమైన మహిళ కడుపులో వైద్యులు నిర్లక్ష్యంతో కాటన్ ప్యాడ్స్ మరిచిపోయారని సదరు బాలింత కుటుంబ సభ్యులు ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రాణాపాయస్థితిలో మహిళ వుందని ఆరోపించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఘటన, గత వారం రోజుల క్రితం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఉప్పల్ గ్రామానికి చెందిన తిరుమల అనే మహిళ డెలివరీ సమయంలో వైద్యులు క్లాత్ అందులోనే వుంచి కుట్లు వేయడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. కడుపు నొప్పితో మళ్ళీ ఆసుపత్రికి వచ్చింది. చాలా సేపటివరకు వైద్యులు ఎవరు రాకపోగా హాస్పిటల్ ఆయవైద్యం చేసింది. అందుబాటులో లేని వైద్యులు, ఫోన్ కాల్ ద్వారానే వైద్య తతంగం సిబ్బంది నడిపిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చి మహిళా బంధువులు నిలదీయగా ఘటన వెలుగు చూసింది. డెలివరీ సమయంలో మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ పట్టింపు లేకుండా వ్యవహరించారని బంధువుల ఆరోపణ.ఆసుపత్రి సూపరిండెంట్ నిర్లక్ష్య ధోరణి తోనే వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.మరో ప్రాణం బలి కాకముందే ఆసుపత్రి ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం

**- ట్రాక్టర్, గడ్డివాము దగ్ధం**



**వరంగల్** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారు కొత్తపల్లి రోడ్డు పై ట్రాక్టర్లో తరలిస్తున్న గడ్డివాము కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గడ్డివాము తో పాటు ట్రాక్టర్ దగ్ధం అయింది. ప్రమాదాన్ని గ్రహించి డ్రైవర్ మరియు సహాయకులు తప్పించుకున్నారు.
ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు.

## సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులను

# కొనసాగించాలి

**హైదరాబాద్** కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేట్ తో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడాదరు. ఆంధ్రా ప్రదేశ్ లో సైనిక్ స్కూల్స్ లో 67 శాతం లోకల్ కోటా లో తెలంగాణ విద్యార్థులను తొలగించడం తో వేలాది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణ లో సైనిక్ స్కూల్స్ ప్రారంభం అయ్యే వరకు తెలంగాణ విద్యార్థులకు ఆంధ్రా లో లోకల్ కోటా ఉంచాలని ఫోన్ లో విజ్ఞప్తి చేసారు.

మంగ ళవారం సాయంత్రం కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కలవనున్నారు. అప్పటివరకు తల్లిదండ్రులు సంయమనం తో ఉండాలని విజ్ఞప్తి చేసారు.

# మహిళ అనుమానస్పద మృతి



**విజయనగరం** గరివిడి మండలం అర్తమూరులో ఓ మహి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామానికి చెందిన యడ్ల ఆసిరి తల్లి (70) సోమవారం తెల్లవారుజామున నిప్పు అంటించుకుని మృతి చెందినట్టు గ్రామానికి చెందిన కొందరు, ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి అగ్నికి ఆహుతయినట్టు మరికొందరు చెబుతున్నారు.ఆమె గత నాలుగు మాసాలుగా కాలుకి ఇన్ఫెక్షన్ అయి తీవ్రంగా బాధ పడటంతో నొప్పి తీవ్రతను భరించలేక నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుందన్ని ఇంకొందరు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి ఒక నిండు ప్రాణం అగ్ని కీలలకు ఆహుతయిన దుర్ఘటన ఇవాళ ఉదయం ఆ గ్రామంలో చోటు చేసుకుంది. మృతిరాలికి ఇద్దరు కుమారులు,మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ

# నిపుణుల బృందం పర్యటన

**ఏలూరు** పోలవరం ప్రాజెక్టు ను సోమవారం నుంచి అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించి అక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించి జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు తగు సూచనలు సలహాలు ఇవ్వనుంది.
అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు.
వీరితో పాటుగా పి పి ఏ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు, సరబ్జిత్ సింగ్ భక్షి,రాకేష్ తోతేజ, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సి ఎస్ ఎం ఆర్ ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ సి ఈ కే నరసింహ మూర్తి, ఎం ఈ ఐ ఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్బాబు అంగర పనుల వివరాలను నిపుణుల బృందం, అధికారులకు వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు, భూమి పటిష్టత జరుగుతున్న తీరు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్టత పనులు పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వచ్చిన నిపుణుల బృందం తొలుత జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమావేశం అయింది.

# మిషన్ భగీరథ అధికారులతో కోరుట్ల ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్

**మెట్ పల్లి** మిషన్ భగీరథ ప్రగతి పరిస్థితులపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంపును సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు, శుద్ధి కేంద్రాల నిర్వహణ, నీటి సరఫరా సమస్యలు, గ్రామాల్లో తాగునీటి అవసరాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేల తగిన చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా తాగునీటికి ఏలాంటి ఇబ్బందులు రానివద్దని అందుకు తగిన చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా లీకేజీ సమస్య ఉన్నచో వెంటనే సరి చేయాలన్నారు. వంద శాతం పైప్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వార నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచి నీటిని అందించాలని అన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ లో పనిచేస్తున్న పంప్ ఆపరేటర్స్ కి గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఎ జి ఎం సందీప్ గారితో మాట్లాడి వెంటనే జీతాలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు, సంబంధిత విభాగాల ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నన్ను నేరుగా వచ్చి కలవచ్చు

**- సమస్యలు పరిష్కరిస్తాం - జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**



**మహబూబాబాద్ :** పోలీస్ శాఖ అనేది ప్రజలకు సేవ చేయడానికి ఉండే సంస్థ . ప్రతి పౌరుడు తమ సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులు నేరుగా పోలీస్ అధికారులకు తెలియజేసే హక్కు కలిగి ఉన్నారు. ఇందులో ఎటువంటి మధ్య వర్తులు, సిఫార్సు దారులు, లేదా ఎలాంటి ఇతర ప్రభావాలు అవసరం లేదు . మేము (పోలీస్ అధికారులు) ప్రజల అవసరాలను గౌరవించి, పారదర్శకమైన విధానాలతో స్పందించడానికి కట్టుబడి ఉన్నాము. ఎస్పీ కార్యాలయం ప్రతిరోజూ విధి విధానాల ప్రకారం ప్రజలకు అందు బాటులో ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను స్వయంగా చెప్పగలగడం ద్వారా సమస్యల పరిష్కారం త్వరితగతిన జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఇతరులు ప్రజల సమస్యలను తప్పుగా లేదా వక్రీకరించిన విధంగా తెలియజేసే అవకాశం ఉన్నందున, ప్రజల సౌకర్యార్థం మరియు న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో, ఎవరూ ఎటువంటి భయాందోళన లేకుండా మహబూబాబాద్ జిల్లా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ని కలవ వచ్చునని, పోలీసులు, ప్రజల స్నేహితులుగా ఉండే విధంగా వ్యవహరించడమే మా లక్ష్యమని ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది.

## యువజన కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**జమ్మికుంట** జమ్మికుంట పట్టణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మరియు యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, పట్టణంలోని వివాహ వేడుకకు ఆదివారం హాజరయ్యారు. అనంతరం యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ఆహ్వానం మేరకు జమ్మికుంట లోని వారి యువజన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భం గా అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, వారిని శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో; కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమారస్వామి, యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజ కవర్గం ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబూషి అజయ్, నాయకులు పచ్చిమట్ల భాను, వెంకటేష్, ఎండీ.జావిద్, సల్మాన్, చిరంజీవి, సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు...

## గార్డియన్ స్కూల్‌లో 50% ఫీజు రాయితీతో

# అడ్మిషన్లు ప్రారంభం...!

**- ప్రైవేటు ఇంగ్లీష్ విద్యను పేద విద్యార్థులకు అందించడమే ముఖ్య ఉద్దేశం.**




**జమ్మికుంట** ప్రస్తుత పరిస్థితులలో ప్రవేటు పాఠశాలలు అధిక ఫీజుల దోపిడీ లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి క్రమంలో. జమ్మికుంట కొత్తపల్లిలోని సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ తో పేద మధ్యతరగతి పిల్లలకి నాణ్యమైన ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్, తెలిపారు. ?
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు ప్రైవేట్ పాఠశాలలో చదవాలనేటువంటి కోరికను నెరవేర్చుటకు గార్డియన్ స్కూల్ నీ స్థాపించామని ఇట్టి సదవకాశాన్ని జమ్మికుంట పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు తమ పిల్లలను గార్డియన్ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని అడ్మిషన్ల కోసం పాఠశాల కార్యాలయ ఫోన్ నెంబర్ (8121266344) గల నెంబర్ కు సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ అంకుష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు...

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించాలి అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్ష పదవి చేపట్టిన చర్ల జగ్గిరెడ్డి తొలిసారిగా అమలాపురం ప్రెస్ క్లబ్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మూసివేసింది.రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయకుండా దళారులకు మద్దతు పలుకుతోంది. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించాలి. కమిషన్ల కోసం అమరావతి పనులను ప్రారంభించడం కాదు. ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందని అన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలకు

# ముస్తాబయిన భాగ్యనగరం




**హైదరాబాద్** మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. వందకు పైగా దేశాల నుంచి వచ్చే అందాల భామలకు స్వాగతం చెప్పేందుకు ప్రత్యేకంగా శంషాబాద్ ఎయిర్ పోర్టును తీర్చిదిద్దారు.

తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో విదేశీ ప్రతినిధులకు స్వాగతం పలికేందుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. నేటి నుంచి విదేశీ ప్రతినిధుల రాక పెరగనుంది.



ఇందుకోసం ఎయిర్ పోర్ట్ లో ప్రత్యేక లాంజ్ లతో పాటు, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ జరూర్ ఆనా (ఓబీబబి ఎతిబతిబి ఎవశ్రీజీనిణజీనిజీ) నినాదం ప్రతి చోటా కనిపించేలా, వినిపించేలా పర్యాటకశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# జూబ్లీహిల్స్ లో “బూమ్ బూమ్”

**- థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి చేత వ్యభిచారం..**
**- సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్.**
**- థాయ్ లాండ్, బంగ్లాదేశ్ నుంచి యువతులను రప్పించి దందా.**

**హైదరాబాద్** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో సర్వీస్ అపార్ట్మెంట్ లో వ్యభిరారం చేస్తూ ఇద్దరు విదేశీ యువతులు పట్టుబడ్డారు. థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి పోలీసులకు దొరికిపోయింది. సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్ నడుస్తోంది. బంగ్లా యువతి (23).గత డిసెంబర్ లో అక్రమంగా సరిహద్దు దాటి వచింది.

థాయ్ లాండ్ యువతి(30) డిసెంబర్ లో ట్రావెల్ వీసాతో స్నేహితుడి కోసం వచ్చి చెన్నై మీదుగా హైద్రాబాద్ వచ్చింది.బ్యాంకాక్ లోని వ్యభిచార నిర్వాహకురాలి సూచనలతో నాయక్ అనే వ్యక్తి నడిపించే బ్రోతల్ హౌస్ లో వ్యభిచారం ప్రారంభించారు. బంగ్లాదేశ్ నుంచి యువతిని తెచ్చిన ఏజెంట్.. థాయ్ లాండ్ మహిళ, బ్రోతల్ హౌస్ నిర్వాహకుల మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు.

# మహానాడుకు ఏర్పాట్లు

**- ఏర్పాట్లు చేస్తున్న మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిలు**



**బద్వేలు** కడప జిల్లాలో టీడీపీ మహానాడు నిర్వహించేందుకు సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలోని భూములను... పార్టీ అధిష్టానం అనుమతితో తెలుగుదేశం నేతలు ఎంపిక చేశారు. ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, రాంగోపాల్ రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, వాస్తు సిద్ధాంతి జయరామిరెడ్డి కడపలో పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. చివరికి సీకే దిన్నె మండంలోని భూములను ఎంపిక చేశారు. మహానాడు ప్రాంగణం, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ కు స్థలాలను గుర్తించారు. ఈ స్థలం కడపను తిరుపతి, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్ మార్గాలతో కలిపేదిగా ఉందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ద్వారా భూముల యాజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నారు. ప్రత్యేక సమావేశంలో శాటిలైట్ మ్యాప్ ద్వారా మహానాడుకు అవసరమైన స్థలాల వివరాలను బృందానికి ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి వివరించారు. మరింత స్థలం అవసరమైనా రైతుల అనుమతి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 7న పనులకు భూమిపూజ నిర్వహించి శరవేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడు జరగనుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588